# శ్రీ నారద ప్రణీత భక్తి సూత్రములు



శ్రీ విష్ణు రూపాయ నమః శివాయ
వేద గ్రంథాలయం
9666122140
vedhagrandhalayam@gmail.com

# శ్రీ నారద ప్రణీత భక్తి సూత్రములు

(భక్తి పరిచయము)

1. **అథాతో భక్తిం వ్యాఖ్యాస్యామః**

కాబట్టి ఇప్పుడు 'భక్తి' గురించి వ్యాఖ్యానించుకుందాం. వివరించుకుందాం.

2. **సాత్వస్మిన్ పర(మ) ప్రేమరూపా**

అట్టి భక్తి అత్యుత్తమ ప్రేమరూపమైనది. స్వరూప - స్వభావరీత్యా అభౌతికమైన ప్రేమ స్వరూపం సంతరించుకోవడమే భక్తి. **సహజీవులుయొక్క ఇహత్వాన్ని అధిగమించి సర్వులలోని - సర్వులుగా వున్న పరత్వాన్ని ప్రేమించడం.**

3. **అమృత స్వరూపా చ.**

అది అమృత స్వరూపము. తెంపు లేని మాధుర్య ధార. మృతములేని అకార-అకాబద్ధ ప్రేమ.

4. **యల్లబ్ధ్వా పుమాన్ సిద్ధో భవతి, అమృతో భవతి, తృప్తో భవతి,**

ఏ పరాప్రేమైతే సంపాదించుకున్న తరువాత సిద్ధించవలసినది సిద్ధించినదగుచున్నదో వారు స్వయంగా అమృత స్వరూపులగుచున్నారు. అనిర్వచనీయ తృప్తిని అనునిత్యం చేసుకుంటున్నారు.

5. **యత్ ప్రాప్య నకించిత్ వాంఛతి, న శోచతి, న ద్వేష్టి, న రమతే, నోత్సాహీ భవతి.**

ఆ పరాప్రేమ ప్రాప్తించిన తరువాత వారికిక క్రొత్తగా (లేక) వేరుగా కాంక్షించవలసినది గాని, దుఃఖించవలసినదిగాని, ద్వేషించవలసినదిగాని, రమించ వలసినదిగాని ఉత్సాహం కలిగి ఉండవలసినది గాని మరొకటేదీ ఉండదు. ఈ జగత్తంతా ప్రేమమయంగా గోచరిస్తుంది. పరమాత్మయొక్క ప్రియ ప్రత్యక్ష రూపంగా గోచరమౌతుంది.

6. **యత్ జ్ఞాత్వా మత్తో భవతి, స్తబ్ధోభవతి, ఆత్మరామో భవతి**

పరా ప్రేమను ఎరిగిన తరువాత ఇకవారు భక్తి రసముచే మత్తులై లౌకిక విషయముల పట్ల స్తబ్ధులై, సర్వదా ఆత్మయందే రమించుచున్నవారై (ఆత్మారాములై) ఉంటారు. జగత్తంతా కూడా పరా ప్రేమ స్వరూపంగా అగుపిస్తుంది.

7. **సా న కామయమానా, నిరోధరూపత్వాత్**

అది లౌకిక వస్తువుల పట్ల ఏర్పడే కోరికవంటిది కాదు. వారిది సర్వ లోకసంబంధమైన కోరికలకు నిరోధ రూపమైన ఆవలివడ్డు. ఆ భక్తులు అయ్యా! మాకు భక్తి అనునిత్యమైతే చాలు! ఇంకేమీ అఖర్లేదు!.... అంటారు!

8. **నిరోధస్తు లోక వేద వ్యాపార న్యాసః**

అది లోక వ్యాపారములకు, వేద (శాస్త్ర) క్రియాదులకు కూడా ఆవల (నిరోధ రూపం). లౌకిక విషయాలను అధిగమించినట్టి అలౌకికానందం! అలౌకికప్రేమ!

**9. తస్మిన్ అనన్యతా, తద్విరోధిషు ఉదాసీనతా చ**

(అంతటా పరమాత్మయే సందర్శనమగుచుండగా) వారు ఆ పరమాత్మ స్వరూపము పట్ల అనన్య చిత్తులై ఉంటారు. తద్విరోధ విషయములన్నింటిపట్ల (లౌకిక విశేషములపట్ల) ఉదాసీనులై ఉంటారు. సహజమగు పరతత్త్వము అత్యంత ప్రియంగాను, సందర్భమాత్రమగు ఇహతత్త్వము స్వల్ప విషయంగాను దర్శిస్తున్నారు.

**10. అన్యాశ్రయాణాం త్యాగో అనన్యతా**

అన్యములైన ఆశ్రయములన్నీ త్యజించి ఉండటమే అనన్యత. అంతా అదే అయినప్పుడు అన్యమైనదంటూ ఏముంటుంది? పరమాత్మయే ఈ అన్ని రూపాలుగా అనిపించటమే అనన్యత!

**11. లోక వేదేషు తదనుకూలాచరణం తద్విరోధిషు ఉదాసీనతా చ**

లోక విషయాలలోను-శాస్త్ర విధులలోను లోకహితైషులై, అనుకూలాచరణులై ఉండటం, ప్రతికూల విషయాల పట్ల ఉదాసీనులై ఉండటం. పరమాత్మ కొరకై లౌకిక విధులు నిర్వర్తిస్తూ ఉండటం (ఉదాసీనత). అంతా అదే! కనిపించేదంతా అదే అయివున్నప్పుడు ఇక కన్నుమూతలెందుకు?- అని అస్వాదిస్తూ వుంటారు.

**12. భవతు నిశ్చయదార్ఢ్యాదూర్ధ్వం శాస్త్ర రక్షణమ్**

భక్తియొక్క 'నిశ్చయము - ఉన్నతి' కొరకై శాస్త్రములచే చెప్పబడే విధి విధానములను నిర్వర్తించే ఉద్దేశ్యం కలిగి ఉంటారు. శాస్త్ర ప్రవచిత వాక్యములకు ప్రచారకులై ఉంటారు. భక్తి కొరకై శాస్త్రాలు ఆశ్రయిస్తారు గాని, శాస్త్రం కొరకు భక్తిని కాదు. భక్తియొక్క సిద్ధియే ఆశయంగా కలిగి వుంటుంది. విధి-నియమాలు ఎందుకు? వారిమనస్సు పరాభక్తి సర్వత్రాప్రేమ యొక్క ప్రవృద్ధి కొరకు సర్వత్రా అనురాగము విరాగమే!

**13. అన్యధా పాతిత్యాశంకయా**

పరాభక్తికి అనుకూలం కానిది అయోగ్యమని తమ ప్రవర్తనాదులచే ప్రకటిస్తూ ఉంటారు. భక్తికి సానుకూల్యం కానిది త్యజించుచూ వుంటారు. సర్వత్రా ప్రేమలేని విధి నియమాలు పతన హేతువులుగా శంకిస్తారు.

**14. లోకోపి తావదేవ; కింతు భోజనాది వ్యాపారస్త్వా శరీరధారణావధి**

లోక వ్యవహారంగాని శాస్త్రంగాని అనన్య భక్తి కలిగేందుకే! భోజనాది వ్యవహారాలు దేహం దేహధారణ కొరకు మాత్రమే ! శరీరధారణ-కర్మలు... అన్నీ భక్తికొరకే! పరాభక్తియే జీవిత పరమాశయం!

**15. తల్లక్షణాని వాచ్యంతే నానామత భేదాత్**

ఆ భక్తియొక్క వివిధ లక్షణములే వేరు వేరు మతములలోని భేదమంతా ! అన్ని మతములు విధి - విధానముల దృష్ట్యా వేరు వేరుగా కనిపిస్తున్నప్పటికీ..అవన్నీ చూపించే భక్తి తత్త్వము ఒక్కటే. అన్ని మతముల అంతిమసారం పరాప్రేమను సంతరించుకోవటమే. భక్తి ఒకానొక మహత్తర లక్షణము! మతములన్నీ మానవులకు భక్తిని నేర్పటానికీ వున్నాయి!

**16. పూజాదిష్వనురాగ ఇతి పారాశర్యః**

పరాశరముని 'పూజ ద్వారా భగవంతుని పట్ల అనురాగం పెంపొందించుకొనటం'అనే కాయిక భక్తిని ప్రభోధిస్తున్నారు. పూజచే భక్తి (లేక) పరాప్రేమ దినదిన ప్రవృద్ధమానవుతూ వస్తుంది. సర్వే సర్వత్రా అనురాగమే పరాభక్తియొక్క రూపంగా వారు చెప్పుచున్నారు. ఇంద్రియిఉలను పరమాత్మకు సమర్పించే పూజా పుష్పాలుగా భావన చేయటం పరాభక్తికి మార్గంగా వారు ఉపదేశిస్తున్నారు!

**17. కథాదిష్వితి గర్గః**

గర్గాచార్యులు 'భక్తుల కథలను - అవతారమూర్తులను ఆరాధించి తద్వారా భక్తిని పెంపొందించుకోవటం' సూచిస్తున్నారు. భక్తుల స్వభావ-లక్షణములను అవతార మూర్తుల లీలను గానంచేయటం పరాభక్తికి ముఖ్యమైన మార్గంగా వారు చూపుచున్నారు!

**18. ఆత్మరత్యవిరోధేనేతి శాండిల్యః**

శాండిల్యముని "ఆత్మయొక్క లక్షణములుగా చెప్పబడిన సర్వస్వరూపత్వము -అఖండత్వము - అప్రమేయత్వము - నిర్మలత్వము... మొదలైనవి సంతరించుకోవటం తదితర లక్షణమైన మనోబుద్ధి చిత్తాహంకారాలకు, సంబంధించిన స్వభావం వదలి ఉండటం... అను మార్గాన్ని ప్రవచిస్తున్నారు. సర్వులను ఆత్మరూపంగా దర్శిస్తూ వుండటం భక్తికి మార్గం శ్రీ శాండిల్యముని ప్రవచనం!.

**19. నారదస్తు తదర్పితాఖిలాచారతా, తద్విస్మరణే పరమవ్యాకులతేతి (చ)**

ఇక ఈ నారదుని అభిప్రాయం వినండి. "సర్వ కార్యక్రమములను ఆ సర్వేశ్వరునికి సమర్పించటం, పరమాత్మను విస్మరించే సందర్భాలపట్ల వ్యాకులచిత్తులై ఉండటం". కర్మలను పరమాత్మకొరకై అని భావిస్తూ, **ఇదంతా నాతో సహా పరమాత్మయొక్క ప్రత్యక్షరూపమే -** అని ఉపాశించటం!

**20. అస్త్యేవ మేవమ్**

అట్టి పరమోత్కృష్టమైన పరాభక్తిని సంపాదించుకున్నవారు ఎక్కడైనా ఉన్నారా ? తప్పకుండా ఉన్నారు! అల్ప దృష్టిచే అల్పవిషయాలే గోచరిస్తాయి. ఉత్తమ దృష్టిచే పరాప్రేమ స్వరూపులను గుర్తించగలం.

**21. యథా వ్రజగోపికానామ్**

బృందావన గోపికలే అందుకు మనకు ఒక నిదర్శనం. వారు ఈ సర్వప్రాపంచిక కర్మలు భగవంతుని ఉద్దేశించి నిర్వర్తించువారు. సర్వే సర్వత్రా కృష్ణచైతన్యమునే దర్శించి పరవశులౌతూ ఉంటారు.

**22. తత్రాపి న మహాత్మ్యజ్ఞాన విస్మృత్యపవాదః**

ఆ గోపికలు ఈ దేహముతో దైనందిన కార్యక్రమములు నిర్వర్తిస్తున్నప్పటికీ వారు పరమాత్మ యొక్క మహత్తును కించిత్ కూడా ఏమరచుట లేదు. అంతాకూడా కృష్ణచైతన్యానందమే అని ఆస్వాదిస్తూ వున్నారు.

**23. తద్విహీనం జారాణా మివ**

భగవంతుని ఏమరచటమే మనస్సు యొక్క జారత్వమని జనులు గ్రహించి ఉండెదరు గాక! ఆ ఏమరుపే అప్రతిష్ఠ (న-ప్రతిష్ఠ) అంతా పరమాత్మ సంకల్పమే కదా! - అని అనుకుంటే పరాభక్తి! వాళ్ళు కారణం-వీళ్ళు కారణం - అని అనుకుంటుంటే - జీవత్వం!

**24. నాస్త్యేవ తస్మిన్ తత్సుఖ సుఖి త్వమ్**

ఆ సర్వాత్మకుని మనసా - వాచా - కర్మణా భక్తితో ఆశ్రయించి ఉన్నవారికి లభించే సుఖం లౌకిక - ప్రాపంచిక సుఖం వంటిది కాదు. వారికి లోకసంబంధ మైనదేదీ రుచించదు. అలౌకిక సుఖం, ఆత్మానందం! కనబడేదంతా-బయట, లోపల కూడా శ్రీకృష్ణ చైతన్యమే!... అని తలచే దోపి కల ఆత్మసుఖంతో పోల్చగలిగినదేమున్నది?

## పరాభక్తి స్వరూపము

**25. సా తు కర్మ జ్ఞాన యోగేభ్యోఽ పి అధికతరా**

ఆ పరాభక్తి యొక్క సంస్థితి కర్మ - జ్ఞాన - యోగముల కంటే సమున్నతమైనది. ఆ మూడింటి పరాకాష్టయే భక్తి! ఆ మూడింటి క్రమ-క్రమమంతా భక్తితో లయమౌతుంది.

**26. ఫలరూపత్వాత్**

ఎందుకంటే, కర్మ - జ్ఞాన - యోగముల అంతిమ ప్రయోజనం ప్రేమ (భక్తి) స్వరూపాన్ని సంతరించుకోవటమే సుమా ! ఇక భక్తికి భక్తియే ప్రయోజమై వున్నది!

**27. ఈశ్వరస్యాఽ పి అభిమానద్వేషిత్వాత్, దైన్య ప్రియత్వాత్**

అందుచేత ఈ ప్రాపంచిక విషయముల పట్ల అభిమాన - ద్వేష - దైన్య - ప్రియత్వాలను కలిగి ఉండటం కంటే వాటినన్నింటినీ ఆ పరమాత్మ వైపుగా మలచుకొని ఉండటమే సముచితం. అభిమానము-ద్వేషము-దైన్యము-ప్రియము పరమాత్మవైపుగా ఎక్కుబెట్టబడినప్పుడు పరమాత్మయే లభిస్తున్నారు. ఉద్ధవుడు - శిశుపాలుడు-కంసుడు-వసుదేవుడు అందుకు ఉదాహరణాలు!

**28. తస్యాః జ్ఞానమేవ సాధవమిత్యేకే**

"అట్టి పరాప్రేమను సంపాదించాలంటే జ్ఞానమే ఉత్తమ సాధనము"... అని కొందరి సిద్ధాంతం (It is one school of thought) జ్ఞానము పుష్పమైతే పరాప్రేమ (భక్తి) ఫలము అని వారి బోధ.

**29. అన్యోన్యాశ్రయమిత్యన్యే**

"జ్ఞానము వలన భక్తి, భక్తి వలన జ్ఞానము ప్రవృద్ధమౌతూ ఉంటాయి. ఒకటి రెండవ దానిని ఆశ్రయించుకొని ఉంటుంది" అని మరికొందరు సిద్ధాంతం. (It is another school of thought) . జ్ఞానమున్నచోట భక్తి స్వభావసిద్ధం! భక్తి ఉన్నచోట జ్ఞానము స్వభావ సిద్ధం!

**30. స్వయం ఫలరూపతేతి బ్రహ్మ కుమారః**

భక్తి యొక్క ఉత్తమ ప్రయోజనం నిశ్చలమైన భక్తియే. స్వస్వరూపం సంతరించు కోవటమే భక్తి యొక్క అత్యుత్తమ ప్రయోజనం... పరాభక్తిని కలిగి ఉండటమంటే,.... తనను తాను

పొందటమే ! ఇది నారదుని అభిప్రాయం. సముద్రంలో తరంగం లయమగుచున్నట్లు తాన ఇష్టదైవ విలీనుడవటం.

31. **రాజ - గృహ - భోజనాదిషు, తదైవ దృష్ట త్వాత్**

ప్రతి జీవుని వాస్తవ స్వభావం పరాభక్తితత్త్వమే ! తదితరమైనది అస్వభావము. దృష్టాంతాలు :

1) (తిరుణాలలో) తప్పిపోయిన రాజకుమార బాలుడు మరల దొరకడం.

(ఆత్మత్వము తిరిగి సంతరించుకోవటం)

2) ఇంటి నుంచి బయలుదేరిన ఇంటి యజమాని ఎక్కడెక్కడో తిరిగి మరల ఇంటికి చేరడం (ఏమరచినన 'సోऽహమ్' ను తిరిగి చేరుకోవటం)

3) తినక పోవడం చేత ఏర్పడిన ఆకలి తినటం చేత ఉపశమించి ఈ దేహం యథాస్థితిని పొందడం వలె. (ఆత్మభావనచే సంసారమును జయిచటం)

32. **న తే న రాజా పరితోషః క్షుచ్ఛాంతిర్వా**

1) ఆ రాజ బాలకుడు క్రొత్తగా యువరాజు కాలేదు. తప్పిపోకముందే యువరాజు అయి ఉన్నాడు. జీవుడు తన ఆత్మత్వం ఆస్వాదించటం అటువంటిదే!

2) ఇంటిలో ఉన్న యజమానే బయటకు వెళ్ళి తిరిగి ఇంటికి చేరాడు. ఆత్మ ప్రదక్షిణం... తిరిగి పరమాత్మతో తన్మయమవటం.

3) ప్రశాంతంగా ఉన్న దేహం ఆకలిచే క్షుబ్ధమై, ఆహారం గ్రహించగానే మరల ప్రశాంతత పొందింది.

(అట్లాగే జీవుడు తన యథాస్థితమగు ఆత్మస్థితిని సంతరించుకుంటున్నాడు)

33. **తస్మాత్ సైవ గ్రాహ్యా ముముక్షుభిః**

అందుచేత ముముక్షువులంతా (ఏ మార్గంలో పయనిస్తున్నప్పటికీ) తన్మయస్థితి "స్వస్వరూప స్వస్థితి" యే లక్ష్యమై యున్నదని ఎఱిగి ఉండెదరు గాక. స్వభావసిద్ధమైన పరాప్రేమను సంతరించుకొనెదరు గాక !

## భక్తి సాధనములు

34. **తస్యాః సాధనాని గాయంత్యాచార్యాః**

అట్టి పరాప్రేమ స్థితి (భక్తి స్థితి) ని జేరటానికి సంబంధించిన సాధనముల గురించి వివిధ ఆచార్యులు గానం చేస్తున్నారు. జనులకు మార్గం చూపుచున్నారు!

35. **తత్తు విషయ త్యాగాత్ సంగత్యాగాత్ చ.**

అట్టి ఆయా సాధనముల ద్వారా లౌకిక-ప్రాపంచక విషయములను, ఆ విషయములతో ఏర్పడుచున్న సంగము (Attatchment) ను జయించటమే ఆచార్యులందరి ఉద్దేశ్యము.

సంగమును దాటితే సద్వస్తువే అనుభవమౌతుంది.

**36. అవ్యావృత భజనాత్**

భగవంతుని కొరకై (అంతయు అయి ఉన్న) భగవంతుని అనునిత్యంగా (constantly) భజించటమే అందుకు సాధనం. ఇది కావాలి-అని కాకుండా-ఏది ఎట్లు వుంటే అదంతా నీవే - అని అకారణోపాసన. అహంతు అకామః అంటూ భక్తిని ఆశ్రయించటం!

**37. లోకేపి భగవద్గుణ శ్రవణ కీర్తనాత్**

లౌకిక వ్యవహారాలలో ఉంటున్నప్పటికీ భగవంతుని గుణాదులను శ్రవణం - కీర్తనం చేస్తూ ఉండటం మరొకసాధనం! పాలలోను-పండులోను-నీటిలోను పరమాత్మ తత్త్వాన్ని గమనించటం. లక స్వరూపము లోకేశ్వరునిదే! అను భావనచే సర్వేశ్వరుని గుణాలే కీర్తించటం!

**38. ముఖ్యతస్తు మహాత్కృపయైవ భగత్కృపాలేశాత్ వా**

ఆ భగవంతుని చేరాలంటే మహాత్ముల కృపకు పాత్రుల మవటమే ప్రధాన లక్ష్యం. భగవతత్త్వాన్ని సముపార్జించిన మహనీయులను ఆశ్రయించుటయే ముఖ్యోపాయం. మహాత్ముల కృప భాగవత్ కృప. భగవదనుగ్రహంగా లభించేదే మహనీయులతో సాంగత్యం, సామీప్యత.

**39. మహాత్సంగస్తు దుర్లభో, ఆగమ్యో అమోఘుశ్చ**

మహనీయులతో భగవద్భక్తులతో (పరా ప్రేమస్వరూపులతో) ఏర్పడే సాంగత్యము దుర్లభము. అది అనిర్వచనీయమైన, అమోఘమైన ప్రయోజనం కలిగి ఉంటుంది. ఎట్లాగైనాసరే, మహనీయుల సామీప్యతను, స్నేహమును, కృపను సంపాదించుకోవాలి!

**40. లభ్యతేపి తత్కృప యైవ**

మహాత్ములతో సాంగత్యము దుర్లభమైనప్పటికీ అది భగవదనుగ్రహం చేత తప్పక లభిస్తుంది. సర్వదా మహనీయుల కృపకు అర్హులవటానికి యత్నించాలి! అది భగవదనుగ్రహమే! ఆ మహనీయులు అకారణ కృపాసాగరులై వుంటారు!

**41. తస్మిన్ తజ్జనే భేదాభావాత్**

భగవంతునికి, మహనీయుడైన భగవత్ భక్తునికి భేదం ఉండదు. భక్తుని సమీపించ టమంటే భగవంతుని సమీపించటంతో సమానమౌతుంది.

**42. తదేవ సాధ్యతాం. తదేవ సాధ్యతామ్**

అందుచేత, ఎంత కష్టపడైనా సరే, ప్రేమతో, సేవాభావంతో మహనీయులయొక్క సామీప్యతను సంపాదించుకోవాలి. తద్వారా హృదయంలో పరాప్రేమను అనుదినం ప్రవృద్ధం చేసుకోవాలి.

**43. దుస్సంగః సర్వదైవ త్యాజ్యః**

దుస్సంగమును ప్రయత్నపూర్వకంగా మొదలంట్ల త్యజిస్తూ క్రమక్రమంగా మహ నీయులతో సత్సంగమును అభివృద్ధి పరచుకోవాలి. రెండిటికీ ఒక్కసారే ప్రయత్నించబడును గాక!

**44. కామ క్రోధ మోహ స్మృతిభ్రంశ బుద్ధినాశ (సర్వనాశ) కారణత్వాత్**

ఎందుకంటే దుస్సంగము అల్పాశయపూర్వకమై ఉంటుంది. కోరికలు, ఆ కోరికల వలన క్రోధము, ఆ క్రోధం వలన స్మృతి భ్రంశము (స్వస్వరూప జ్ఞానము యొక్క ఏమఱుపు) దాని వలన బుద్ధి యొక్క అల్పత్వము సంప్రాప్తించే ప్రమాదము పొంచియున్నది. దుస్సంగము సర్వనాశనకారణమై అల్ప జన్మలకు దారితీయగలదు!

**45. తరంగాయితా అపీమే సంగాత్ సముద్రాయంతే**

చిన్న చిన్న తరంగాలే క్రమంగా మహాసముద్రమగుచున్నట్లు చిన్న చిన్న సంసారిక సాంగత్యాలే క్రమంగా సంసార సాగరంగా రూపు దిద్దుకుంటున్నాయని గమనించ బడుగాక.

**46. కస్తరతి కస్తరతి మాయామ్ ? యః సంగం త్యజతి, యో మహానుభావాన్ సేవతే, (యో) నిర్మమో భవతి...,**

ఈ మాయను దాటగలిగేది ఎవ్వరయ్యా... అంటే, ఎవ్వరైతే ఇంద్రియ - లౌకిక విషయములతో సంగం త్యజిస్తూ వస్తారో; ఎవ్వరైతే మహానుభావులగు పరాప్రేమ స్వరూపులను ఆశ్రయిస్తూ వస్తారో; ఎవ్వరైతే "ఇది నాది.....అది నాది" అనే మమకారాన్ని రహితం చేసుకుంటూ ఉంటారో...

**47. యో వివక్త స్థానం సేవతే, యో లోక బంధమున్మూలయతి, (యో) నిస్త్రై గుణ్యో భవతి, (యో) యోగక్షేమం త్యజతి...,**

ఎవ్వరైతే ఏకాంత చిత్తులై తమయందే స్వస్వరూపంగా వేంచేసియున్న ఆ భగవంతుని ఆరాధిస్తూ ఉంటారో, లోక బంధములన్నిటికీ అతీతత్వము అలవరచుకుంటూ ఉంటారో, త్రిగుణముల దర్శన పరిధిని దాటివేస్తూ ఉంటారో, యోగక్షేమములనుకునే దృశ్యసంబంధమైన సర్వ విషయాలు అధిగమిస్తూ ఉంటారో...

**48. యః కర్మఫలం త్యజతి, కర్మాణి సంన్యస్యతి. తతో నిర్ద్వంద్వో భవతి....,**

సర్వ కర్మ ఫలములను (సమర్పిత భావనా బలంచేత) త్యజించివేస్తూ ఉంటారో, కార్యక్రమములన్నీ (నిర్లిప్తదృష్టిచే) సన్యసించి ఉంటారో,... అట్టివారు నిర్ద్వంద్వులై ఏకాంత భక్తిని ఆశ్రయిస్తూ వస్తారో...,

**49. (యో) వేదానపి సంన్యస్యతి; కేవలమవిచ్ఛిన్నానురాగం లభతే...,**

ఎవ్వరైతే వేద (శాస్త్ర నియమరూప) పరిధులను కూడా దాటివేస్తూ ఉంటారో ఇక ఆ పరమాత్మ పట్ల అవిచ్ఛిన్నమైన అనురాగం సంతరించుకుంటూ ఉంటారో...

**50. స తరతి. స తరతి. సలోకాంస్తారయతి**

వారు తరిస్తున్నారు, తరిస్తున్నారు. అట్టివారు తమను తాము తరింపజేసుకోవటమే కాకుండా, ... తదితర సంసార జీవులను కూడా తరింపజేయడానికి శ్రేయో మార్గమగుచున్నారు.

51. **అనిర్వచనీయమ్ ప్రేమస్వరూపమ్**

ఆ పరాప్రేమ (పరాభక్తి) యొక్క అనుభూతి "ఇట్టిది" అని మనం మాటలతో నిర్వచించలేం ! అది అనిర్వచనీయం. (Non-definable)

52. **మూకాస్వాదనవత్**

మూగవాడు అతిరుచికరమైన ఒక పదార్థాన్ని భుజిస్తూ తదితరులకు ఆ రుచి గురించి ఎట్లా చెప్పగలడు ? ఏమని వర్ణించగలడు ? పరాభక్తిచే పారవశ్యులైనవారు తమ అనుభూతి గురించి చెప్పటానికి మాటలు లేవు, చాలవు. సంసారదృష్టి వీడనివారికి ఆ రసానుభూతిని వివరించటం అటువంటిది.

53. **ప్రకాశ (శ్య) తే క్వాపి పాత్రే**

అది అనుభవిస్తున్న వారికే అర్థమవుతుంది. ఒకానొక శుద్ధాత్ముడగు సత్పాత్రుని యందు అది ప్రకాశిస్తోంది. అతని నుండి లోకములకు ప్రకాశమగుచున్నది. ప్రకాశమును వివరించి చెప్పటానికి మరొకరి అవసరం ఏముంటుంది? భక్తి రుచి తెలిసినవారికే భక్తుల మధురానుభవం తెలియవస్తుంది!

54. **గుణరహితం, కామనారహితం, ప్రతి క్షణం వర్థమానం, అవిచ్ఛిన్నం, సూక్ష్మతరం, అనుభవరూపమ్**

ఆ అనుభూతి సత్వ - రజ - తమోగుణ సంబంధమైనది కాదు. అది గుణ రహితమైనది. "ఏదో కావాలి"... అనే సంసారిక భావన లేనట్టిది. ప్రతి క్షణం ప్రవర్ధమాన స్వభావమే కలిగి ఉండేది. (That is ever-blossoming inner Divinity) విచ్ఛిన్నం (తెంపు) లేనిది. మనోవాక్కుల దృష్ట్యా అత్యంత సూక్ష్మతరమైనది. అది కేవలం అనుభవరూపమే గాని, ఒకరు ఇంకొకరికి చెప్పి తెలిసేటట్లు చేయగలిగేది కాదు. అర్హులైతేనే పరాభక్తియొక్క ఆనందమును గ్రహించగలరు.

55. **తత్ ప్రాప్య తదేవావలోకయతి, తదేవ శృణోతి (తదేవ భాషయతి) తదేవ చింతయతి**

అట్టి మహత్తరమగు పరాభక్తిని సంతరించుకున్న మహనీయులు తమ ప్రియాతి ప్రియమగు ఆ భగవంతునే సర్వే - సర్వత్రా అవలోకిస్తూ ఉంటారు. ఆ భగవతత్త్వమే అన్ని వైపుల నుండి వారికి వినిపిస్తూ ఉంటుంది. వారి భాష - పరిభాష - భావన- అవగాహన... అంతా కూడా భగవన్మయమై ఉంటుంది. నీవుగా కనిపిస్తున్నది పరమాత్మయే అని గమనిస్తూనే-ఆస్వాదిస్తూనే వ్యవహరిస్తూ ఉంటారు.

56. **గౌణీ త్రిధా, గుణ భేదాత్, ఆర్తాది భేదాద్వా**

ఆ భక్తి యొక్క గౌణీస్థితి (సాధనస్థితి) లో మాత్రమే 1) తామసిక భక్తి 2) రాజసిక భక్తి 3) సాత్వీక భక్తి అని 1) ఆర్త భక్తి 2) జిజ్ఞాసు భక్తి 3) అర్థార్థ భక్తి... అని భేదాలన్నీ (మధ్యే మార్గంగా) ఉంటాయి. (పరాకాష్ఠయగు "పరాప్రేమ" స్థితిలోకి వచ్చేసరికి అట్టి

భేదాలన్నీ సమసిపోతాయి). ఎవరు ఎటువైపునుంచి వచ్చినాకూడా, పరాభక్తిలో తన్మయులౌతారు. సముద్రం చేరిన జలానికి నదీ భేదం ఉంటుందా!

**57. ఉత్తరస్మాత్, ఉత్తరస్మాత్, పూర్వ పూర్వ శ్రేయాయ భవతి**

ఆ సాధకులు, ఒక్కొక్క మెట్టు ముందుకుపోతూ ఉంటే పూర్వస్థితి కన్నా శ్రేయస్థితి పొందుతూ చివ్వరికి "పరాభక్తి స్థితి" చేరుకుంటూ ఉంటారు. అర్తభక్తి క్రమంగా జిజ్ఞాసుభక్తిగాను, అర్థార్థ (ఉత్తమగుణ సంపత్తి) భక్తిగాను అయి, ఆపై పరాభక్తిగా రూపుదిద్దుకుంటోంది.

**58. అన్యస్మాత్ సౌలభ్యం భక్తౌ**

భగవంతుని జేరటానికి అనేక మార్గాలు ఉన్నమాట నిజమే. అయితే, ఈ ప్రేమ (భక్తి) స్వభావతః మధురమై అందరికీ అన్నివేళలా సులభసాధ్యమైన మార్గం. జ్ఞానమార్గం-క్రియాయోగ మార్గం ఇత్యాదులకన్నా భక్తిమార్గం సులభతరం!

**59. ప్రమాణాంతరస్యానపేక్షత్వాత్. స్వయం ప్రమాణత్వాత్**

(జ్ఞాన - యోగాదులైతే వాటియొక్క ప్రవృద్ధికి వేరే ఏదైనా ప్రమాణం కావలసి రావచ్చు). భక్తికి వేరే ప్రమాణం అక్కరలేదు. సర్వము ప్రేమాస్పదం అగుచుండటమే భక్తికి ప్రమాణము. జ్ఞానమునకు భక్తి ప్రమాణం. కానీ భక్తికి మాత్రం భక్తియే ప్రమాణం!

**60. శాంతి రూపాత్. పరమానంద రూపాచ్చ**

భక్తియొక్క రూపమైన పరమశాంతి-పరమానంద రూపము సంతరించుకొనుచుండటమే భక్తి యొక్క ప్రవృద్ధికి ప్రమాణం. పరాభక్తి స్వయముగా పరమశాంతి-పరమానంద రూపము అయి ఉన్నది.

**61. లోకహానౌ చింతా నకార్యా: నివేదితాత్మ లోకవేద (శీల) త్వాత్**

అట్టి మార్గంలో సాధన కొనసాగాలంటే లోకహాని కలిగించే చింతలను (ఇతరులకు బాధ కలిగించే వ్యవహారాలను) రహితం చేసుకుంటూ రావాలి. ఆ పరమాత్మయే ఈ కనబడే సర్వ దేహాలుగా సర్వచరాచర సృష్టిగా దర్శించటమే ఆత్మ నివేదన అవుతుంది. ప్రతి క్రియ ప్రేమరసముచే ముంచివేయబడి ఉండుగాక. పరిసరములు ప్రేమతో నింపబడుతాయి. వారు లోకమునకు సానుకూలురుగానే వుంటారుగాని, ప్రతికూలురుగా కాదు!

**62. నతత్సిద్ధౌ లోక వ్యవహారో హేయ: కింతు ఫల త్యాగ: తత్సాధనం చ (కార్యమేవ)**

అట్టి భక్తిని సిద్ధించుకున్నవారు లోక వ్యవహారాలను, లౌకిక ధర్మాలను హేయంగా చూస్తారా? లేదు! భక్తియొక్క పరాకాష్ట స్థితి కర్మఫల త్యాగమే అవుతుంది. కనుక వారు నిర్వర్తించే కార్యములన్నీ కర్మఫల త్యాగరూపంగా సమర్పిస్తారు.కాబట్టి వారికవి భక్తి యోగ సాధనాలే అగుచున్నాయి. పరాభక్తికి కర్మలు-త్యజించవలసినట్టి అగత్యమేదీ లేదు. కర్మఫల సమర్పణయే ఉంది!

## 63. స్త్రీ ధన నాస్తిక (వైరి) చరిత్రం న శ్రవణీయమ్

అయితే సాధకులు "కామము - ధనము - దైవ తిరస్కారం"... ఇటువంటి సంగతులను మననం చేయకుండా వాటికి దూరంగా ఉండటమే మంచిది. అట్టివారి గురించి మాట్లాడుకోకపోవడం ఉచితం. అట్టి సంగతుల సంభాషణ వలన బుద్ధి చంచలత్వం పొందుతూ వుంటుంది కదా!

## 64. అభిమాన దంభాదికం త్యాజ్యమ్

అభిమానము - దంభము (కామము-క్రోధము-లోభము) మొదలైనవి ఎంత వేగంగా వీలైతే అంత త్వరగా వదిలివేస్తూ ఉండాలి. అభిమానము-దురాభిమానము- దంభము మొదలైనవి అందుకు అడ్డు.

## 65. తదర్పితాఖిలాచారఃసన్ కామ - క్రోధాభిమానాదికం తస్మిన్నేవ కరణీయమ్

సర్వ ఆచార - విచారములు ఆ భగవంతునికే సమర్పణ చేయాలి. కామ - క్రోధ-అభిమానాదులన్నీ ఆ భగవంతుని వైపుగా తరలించబడాలి. ఆయనయందు లయం చేయాలి. ఎవడబ్బ సొమ్మని కులుకుచు రిగేవు రామచంద్రా?.... అని రామదాసుగారు ప్రశ్నించలేదా?

## 66. త్రిరూప భంగపూర్వకం నిత్య దాస్య నిత్య కాంత భజనాత్మకమ్ ప్రేమకార్యమ్, ప్రేమైవ కార్యమ్

క్రమంగా "భక్తుడు - భక్తి - భజింపబడునది" అనే త్రిపుటిని దాటి వేయుచుండగా అతడు కేవల ప్రేమ స్వరూపుడు అగుచున్నాడు. అతని నిత్యదాస్యము క్రమంగా అవ్యాజమాన మగుచున్నది. అతని ప్రేమ స్వభావసిద్ధము-అకారణముగా రూపుదిద్దుకుంటోంది! ప్రేమాస్పదుడు ప్రేమరూపుడు అగుచున్నాడు! (His Devine Love state is unconditional and for no purpose)

# భక్తి మహిమ

## 67. భక్తా ఏకాంతినో ముఖ్యాః

(హృదయాంతరాలలో) "కేవల ప్రేమ (Absolute Love)" ఏర్పడుచుండగా అట్టివారు "ఏకాంత భక్తులు" అని పిలువబడుచున్నారు. సర్వేసర్వత్రా పరమాత్మగా దర్శించేవారు ఏకాంత భక్తులుగా చెప్పబడుచున్నారు. ఏకాంత భక్తియే ముఖ్యాశయం!

## 68. కంఠావరోధరోమాశ్చ అశ్రుభిః పరస్పరం లపమానా! పావయన్తి కులాని పృధివీంచ!

అట్టి పరాభక్తులు (ఒకచోట కలిసినప్పుడు) పరమాత్మ గురించి సంభాషించు కొనునప్పుడు వారి గొంతు ప్రేమభావావేశం చేత దగ్గుత్తిక పొందటం, కళ్ళు చమర్చటం జరుగుతూ ఉంటుంది. వారి మాటలు, చేతలు భక్తి రసపూరితమై ఉంటాయి. వారు చూపుమాత్రంచేత దుష్కృతులను కూడా పునీతులుగా తీర్చిదిద్దుతూ ఉంటారు. వారు తాము జన్మించిన వంశాన్ని, ఈ పృధివినీ తమ ఉనికిచే పరమపావనం చేస్తూ ఉంటారు.

**69. తన్మయాః**

వారెక్కడుంటే అక్కడ (ఆ పరిసరాలన్నీ) వారి మహిమచే పరమ పవిత్రమై ఉంటాయి. వారు భగవత్‌స్వరూపులే అగుచున్నారు. పువ్వు ఉన్నచోట పరిమళము వెదజల్లబడునట్లు, వారున్నచోట అవ్యక్తానందం వెల్లివిరుస్తూనే వుంటుంది.

**70. తీర్థీ కుర్వన్తి తీర్థాని, సుకర్మీ కుర్వన్తి కర్మాణి, సచ్ఛాస్త్రీ కుర్వన్తి శాస్త్రాణి**

వారు తాముండే ప్రదేశములను తమ ఉనికిచే తీర్థముగా చేస్తున్నారు. కర్మలన్నిటినీ సుకర్మలుగా మార్చివేస్తూ వుంటారు. శాస్త్రములను తమ భాష్య - ప్రవచనములచే సచ్ఛాస్త్రములుగా (జనులచే) సదుపయోగింపజేయగలరు.

**71. మోదన్తే పితరో, నృత్యన్తి దేవతాః సనాథాచేయం భూర్భవతి**

వారి పిత్రుదేవతలు వారిని కన్నందుకు పరమానందం పొందుతూ ఉంటారు. దేవతలు కూడా ఆత్మానంద భరితులై వారున్న చోట నాట్యం చేస్తూ ఉంటారు. అట్టి పరాప్రేమ స్వరూపుల మహిమ చేతనే ఈ భూమి సురక్షితమై ఉంటోందని గ్రహించబడుగాక.

**72. నాస్తి తేషు జాతి విద్యా రూప కుల ధన క్రియాది భేదః**

అట్టి పరాప్రేమ స్వరూపులకు జాతి - విద్య - కుల - ధన - క్రియాది నిర్ణయాలు ఉండవు. ("ఈ జాతిలోనే - ఈ మతంలోనే - ఈ క్రియలు నిర్వర్తించేవారిలోనే అటువంటివారు ఉంటారు"... మొదలైనవన్నీ ఆపాదించలేం). పరాభక్తి జాతి-మత-కులాలను అనుసరించి వుండేది కాదు! అది అలౌకికమైన స్వమనోవికాస రూపం కదా! పరస్పర మతదూషణ పనికిరాదు! అదంతా పరాభక్తికి అడ్డుగోడలు!

**73. యతస్తదీయాః**

వారెక్కడుంటే అదే భగవంతుని పెన్నిధి, సన్నిధి. పరాప్రేమకు పరాప్రేమయే సాటి!

**74. వాదో న అవలంబ్యః**

(భగవత్ భక్తుల గురించి గాని, తత్త్వ విషయములు - మార్గముల గురించి గాని, ఆ సర్వాత్మకుడగు భగవానుని గురించి గాని) వాదోపవాదములలోకి ప్రవేశించటం ఉచితం కాదు. మార్గ విధివిధానములలోని చిన్న తేడాలను పెద్దవి చేసుకొని వాదించుకోవటం-పరస్పర దూషణ ఉచితం కాదు!

**75. బాహుల్యావకాశత్వాత్, అనియతత్వాశ్చ**

ఎందుకంటే పరమాత్మ సర్వదా ఒక్కడే అయినప్పటికీ, (బుద్ధి - భక్తులను అనుసరించి) వివిధ రూపాదులచే, (కర్మ - జ్ఞాన - యోగాదులను అనుసరించి) వివిధ మార్గములుగా భక్తి సాధనను, జిజ్ఞాసన కొనసాగించటం ఈ ప్రపంచంలో జరుగుతూనే ఉంటుంది. వాదోపవాదములు పెంచినకొలదీ పెరుగుతాయి గాని నిర్దిష్టమైన అవధి లభించదు. అన్నిమార్గాలు పరాభక్తికే దారి తీస్తున్నాయి. (నదీనాం సాగరో గతీ)

**76. భక్తి శాస్త్రాణి మననీయాని త (దు) కర్మాణి కరణీయాని.**

భగవంతునిపై భక్తిని ప్రబోధించే (ప్రవృద్ధపరచే) శాస్త్రాలను మననం చేయటం, ఆ శాస్త్రాలు ఉద్బోధిస్తున్న కార్యక్రమములను ఆశ్రయించటం, భక్తుల కథలను శ్రవణం చేయడం సాధకులకు ఉచితమై ఉన్నది.

**77. సుఖ దుఃఖ ఇచ్ఛా లభాది త్యక్తే ప్రతీ (క్ష్య) క్ష మాణే, క్షణార్థమపి వ్యర్థం న నేయమ్**

ప్రాపంచకమైన సుఖ - దుఖ - ఇచ్ఛ - లాభాది వ్యవహారాలు మాట్లాడుకుంటూ సమయం వృధా పరచుకోరాదు. ('ఆయుష్షు" అనేది పరమాత్మ ఇచ్చిన వరం) - కాలాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి. అర్ధక్షణం కూడా వృధా చేసుకోకూడదు.

**78. అహింసా సత్య శౌచ దయ ఆస్తిక్యాది చారిత్ర్యాణి పరిపాలనీయాణి**

అహింస - సత్యము - శుచి - దయ - భక్తి... వీటిని ప్రవృద్ధ పరచే కార్యక్రమములు, సంగతులు మరల మరల ఆశ్రయిస్తూ ఉండాలి.

**79. సర్వదా సర్వభావేన నిశ్చింతైః (చిత్తః) భగవానేవ భజనీయః**

లౌకికమైన అన్ని చింతలు వదలి సర్వదా సర్వభావములచే ఆ పరమాత్మనే భజించాలి. ఉపాసించాలి. సర్వము ఆయనయే! అని దర్శించాలి.

**80. సకీర్తనీయః (కీర్తమానః) శీఘ్రమేవ ఆవిర్భవతి, అనుభావయతి (చ) భక్తాన్**

అట్లా కీర్తన (ఆరాధన) చేస్తూ ఉండగా అతి శీఘ్రంగా హృదయంలోనే ఆ పరాభక్తి యొక్క అనుభవం ఆవిర్భవించగలదు.

**81. త్రి సత్యస్య భక్తిరేవ గరీయసీ, భక్తిరేవ గరీయసీ**

త్రికాల సత్యమైనట్టి పరమాత్మ వైపుగా సంతరించుకునే భక్తియే అత్యుత్తమమైనది. భక్తి-జ్ఞాన-యోగ మార్గముల భక్తి మార్గము సులభము. ఉత్తమము.

**82. గుణమహాత్మ్యాసక్తి, రూపాసక్తి, పూజాసక్తి, స్మరణాసక్తి, దాస్యాసక్తి, సఖ్యాసక్తి, వాత్సల్యాసక్తి, కాంతాసక్తి, ఆత్మ నివేదనాసక్తి, తన్మయతాసక్తి, పరమ విరహాసక్తి, రూపైకధా అపి.. ఏకాదశధా భవతి.**

**భక్తి (ప్రేమ) యొక్క ఏకాదశ ఆసక్తులు-గుణ విశేషాలు**

1. గుణమహత్మ్యాసక్తి - భగవంతుని విశేష గుణముల పట్ల మహత్యముల పట్ల ఆసక్తి (నారదుడు, వ్యాసుడు)
2. భగవంతుని ఉద్దేశించి గ్రహించు నామ - రూపాదుల పట్ల ఆసక్తి (బృందావన స్త్రీలు)
3. భగవంతుని పూజించటం పట్ల ఆసక్తి (అంబరీషుడు)
4. భగవంతుని పట్ల స్మరణాసక్తి (ప్రహ్లాదుడు)
5. భగవంతుని సేవించుట యందు ఆసక్తి (హనుమంతుడు)
6. భగవంతుని స్నేహభావముతో ఆశ్రయించు ఆసక్తి (అర్జునుడు, ఉద్ధవుడు)

7. వాత్సల్యాసక్తి (దేవకి, యశోద, కౌసల్య)

8. కాంతాసక్తి (రుక్మిణి, పార్వతీదేవి)

9. ఆత్మ నివేదనాశక్తి (బలిచక్రవర్తి, విభీషణుడు)

10. తన్మయాసక్తి (సనత్కుమారుడు)

11. పరమ విరహాసక్తి (గోపికలు, త్యాగరాజు, రామదాసు)

ఇవన్నీ ఒకే భక్తి యొక్క పదకొండు రూపములు మాత్రమే.

83. **ఇత్యేవం వదంతి జన జల్పనిర్భయాః ఏకమతాః కుమార - వ్యాస - శుక - శాండిల్య - గర్గ - విష్ణు - కౌండిన్య - శేష - ఉద్ధవ - అరుణి - బలి - హనుమత్- విభీషణాదయా భక్త్యాచరాః**

సనత్కుమారుడు – వ్యాసుడు – శుకుడు – శాండిల్యుడు – విష్ణువు – కౌండిన్యుడు– శేషుడు – ఉద్ధవుడు – అరుణి – బలి – హనుమ – విభీషణుడు మొదలైన పరాభక్తి శిఖామణులంతా ముక్తకంఠంతో భక్తి యొక్క మహత్యాన్ని స్వయం దృష్టాంతపరంగా ప్రకటిస్తున్నారు. తదితరములన్నీ మధ్యే మార్గములే నని లోకాలకు చాటుచున్నారు. వారి జీవిత విధానాలే పరాభక్తికి సోదాహరణాలు.

84. **య ఇదం నారదప్రోక్తం, శివానుశాసనం విశ్వసితి శ్రద్ధత్తే... స భక్తిమాన్ భవతి, సః ప్రేష్ఠం లభతే, సః ప్రేషం లభతే.**

శ్రీ నారద ప్రోక్తమైన, శివాను శాసనమైన ఈ భక్తి సూత్రములు విశ్వాసముతో, శ్రద్ధతో గ్రహించేవారు భక్తి యొక్క పరాకాష్ఠ యగు శోభను, కళ్యాణమును పొందగలరు.

లోక కళ్యాణమస్తు

**ఓం శాంతిః ఓం శాంతిః ఓం శాంతిః**

## ప్రతులకు


యేలేశ్వరపు హనుమ రామకృష్ణ
రిటైర్డ్ చీఫ్‌మేనేజర్, ఆంధ్రాబ్యాంక్
శ్రీ రామలింగేశ్వర స్వామి గుడి వీధి
కూచిపూడి–**521136** కృష్ణా జిల్లా
సెల్ : **92471 05392** Land : 08671 - 251164

బృందావనం సాయికుమార్
ప్లాట్ నెం. 19, గులాబితోట, ఏలూరు – 1, ప.గో జిల్లా
సెల్ : **9704275472** Land : 08812 - 221876

# స్వపరిచయం



వై. హెచ్. రామకృష్ణ

| | | |
|---|---|---|
| మాతాపితలు | : | యేలేశ్వరపు ఆదిలక్ష్మి కామేశ్వరమ్మగారు, లక్ష్మీ నారాయణగారు |
| జన్మస్థానం | : | భావదేవరపల్లి, కృష్ణా జిల్లా |
| పుట్టిన తేదీ | : | 20-7-1951 |
| స్వగ్రామం | : | కూచిపూడ, కృష్ణాజిల్లా |
| చిరునామా | : | డోర్‌నెం. 2/8, శ్రీరామలింగేశ్వరస్వామి గుడి వీధి,<br>కూచిపూడి-521136 (కృష్ణాజిల్లా) ఆంధ్రప్రదేశ్ |
| విద్య | : | బి.కామ్. (హిందూ కాలేజి, మచిలీపట్నం 1968-71)<br>సి.ఎ.ఐ.ఐ.బి. |
| వృత్తి | : | రిటైర్డ్ చీఫ్ మేనేజర్, ఆంధ్రాబ్యాంక్, |
| ప్రవృత్తి | : | తాత్త్విక చింతన, సద్గోష్ఠులు, ధార్మికోపన్యాసాలు వినటం, శివార్చన, సాహిత్యాభిమానం |
| ఆశయం | : | సర్వమతములు మానవుని జీవితమును సుసంపన్నం చేయటానికి, ప్రశాంతత, ఆనందములతో నింపటానికే ఉన్నాయి. సర్వమార్గముల అంతర్లీగానమే మానవతా వాదము. అట్టి మానవతపు విలువలు పరిరక్షింపబడటానికి నేను సైతం నావంతు కృషి నిర్వర్తించి, తద్వారా 'మానవు డనై ఉండుట' అను మహోత్కృష్టమైన అవకాశమును సద్వినియోగ పరచుకోవటం. |
| ఇతర రచనలు | : | శ్రీ వసిష్ఠరామసంవాదము (యోగవాసిష్టము) వచనకావ్యము<br>భగవద్గీత - వచనము - అధ్యయన పుష్పము<br>కఠ - ఈసావాస్యోపనిషత్ పుష్పాలు మరియు<br>శ్రీ నారద ప్రణీత భక్తి సూత్రములు - తాత్పర్యము<br>గొల్లకలాపము అధ్యయన పుష్పము<br>శ్రీకృష్ణ-ఉద్ధవ సంవాదము (ఉద్ధవగీత) అధ్యయనపుష్పము. |